


# నెలనెలా నవ్వుల పండగ

## మల్లాది వెంకటకృష్ణమూర్తి స్పెషల్

ఆంధ్రాలో ప్రొహిబిషన్ ఉన్న సమయంలో హరికథా కాలక్షేపానికి గుల్బర్గాకి వెళ్ళాడో రామదాసుగారు. ఆయనక్కడ హరికథా కాలక్షేపం ముగించాక ఆర్గనైజేషన్ సెక్రటరీ ఆ దాసుగారికి ఈ క్రింది విషయాలు బోధించాడు.

(అ) రాముడికి ముగ్గురు సోదరులు, నలుగురు కాదు.

(ఆ) రాముడిని శ్రీరామచంద్రమూర్తి అని విశ్వామిత్రుడు పిలిచాడు. ఎస్.ఆర్.సి. మూర్తి అని కాదు.

(ఇ) రాముడు రావణుడిని సంహరించాడు కానీ డిక్కీలో తొంగోబెట్టలేదు.

(ఈ) ఆ రోజుల్లో తుపాకులు, బాంబులు లేవు.

(ఉ) ఇక మీదట ఎప్పుడు మందుకొట్టి హరికథా కాలక్షేపానికి రాకండి..!!

# చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

అదృష్టం తంతే మినిస్టరయ్యాడు ముకుందం. అంతవరకూ విమానం ఎప్పుడూ ఎక్కలేదు. అందుకని వెంటనే ఢిల్లీ ప్రయాణం వేయించుకున్నాడు. మొదటిసారిగా విమానం ఎక్కి కిటికీ పక్కగా కూర్చుని తల దూర్చి కిందికి చూసి వెంటనే "సెక్రెట్రీ" విమానంలోనుంచి మనుషులు అచ్చం చీమల్లాగా కనిపిస్తున్నారు" అన్నాడు.

"సార్ ఇప్పుడు మీరు చూస్తున్నది నిజంగా చీమలనే. విమానం ఇంకా బయలుదేరలేదు" అన్నాడు సెక్రటరీ వినయంగా.

ఎన్నో చిత్రాల్లో ఎన్నో మొహాలకు రంగులు పూసి పేరు తెచ్చుకున్నాడు మేకప్‌మన్ వేషాలావు. ఈ మధ్య విడుదలయిన 'పిచ్చిమాలోకం ' అన్న చిత్రంలో చివరి హీరో ముసలివాడైన తరువాత పిచ్చివాడవుతాడు. పిచ్చివానిగా, ముసలివానిగా' చేసిన మేకప్ అందరి ప్రశంసలందుకుంది. దానికి మెచ్చి ప్రభుత్వం కూడా ఒక అవార్డు పారేసింది. వెంటనే వేషాలావుకు సన్మానం ఏర్పాటు చేశారు.

చివరగా ఆ చిత్రంలో మేకప్‌కు అతను తీసుకున్న శ్రద్ధను గురించి మాట్లాడమన్నారు. వెంటనే మన వేషాలావు ఠక్కున లేచి మైకు దగ్గరకొచ్చి, "నిజానికి నేనసలు ఆ సినిమాలో చివర హీరోకి మేకప్పే చేయలేదు. అలాగే వదిలేసాను" అన్నాడు సగర్వంగా.

సార్! కొత్త పుస్తకం వచ్చింది కొంటారా?

"ఏంటది?"

"అప్పుడే పుట్టిన బిడ్డ మొఖం చూచి ఆడో మగో ఎలా చెప్పడం అన్న పుస్తకం. వెల పదిరూపాయలే సార్"

"అవసరం లేదోయ్. నేను మామూలు పద్ధతిలో అంతకంటే త్వరగ కనుక్కోగలను."

"భర్తను ఆకట్టుకోవడం ఎలా?" అన్న పుస్తకం తెప్పించుకోండి. మీ భర్తలను ఆనంద పెట్టేందుకు కొన్ని వందల మార్గాలు ఇందులో వ్రాయబడి వున్నాయి" అని ఒక పత్రికలో ప్రకటించారు.

ఎంతో మంది పెళ్ళైన స్త్రీలు, పెళ్ళి కావలసిన వాళ్ళు పదిరూపాయలు పంపి పుస్తకం తెప్పించుకున్నారు. అందులో అనేక రకాలైన వంటలు ఎలా చెయ్యాలో వ్రాయబడి వున్నాయి.

"నా భర్త చనిపోతూ ఇచ్చిపోయిన రెండు పుస్తకాలూ నా జీవితంలో ఎంతో సహాయపడుతున్నాయి"

"ఏంటవి?"

"చెక్కు పుస్తకం, వంటల పుస్తకం."

❧❧❧

"ఏరా! ఈ రోజు హిష్టరీ పేపరు ఎలా రాశావు?"

"ఏం బాగా రాయలేదు నాన్నా"

"ఏం?"

"ఎప్పటివో నేను పుట్టక ముందు జరిగిన సంగతులు అడిగితే ఏం రాయాలి?"

❧❧❧

చిత్రకళా ప్రదర్శన జరుగుతోంది. ఆ ప్రదర్శన మీద అందరి అభిప్రాయాలను సేకరించుకోవాలనుకున్నారు కమిటీవాళ్ళు.

"చూడండి! మీకు ఎలాంటి చిత్రాలంటే యిష్టం?" అని అడిగారు ఒకణ్ణి.

"నాకు పెద్ద పెద్ద చిత్రాలంటే ఇష్టం" అన్నాడు వాడు.

"మీరు చూడబోతే గొప్ప కళాపోషకుల్లానూ, కలా విమర్శకుల్లాను వున్నారు. ఇంతకీ మీరేం చేస్తుంటారు?" అని అడిగారు వాళ్ళు.

"నేను పటాలకు ఫ్రేము కడుతుంటాను."

❧❧❧

ఏదైనా నాటకం బాగోలేకపోతే కుళ్ళిపోయిన టమోటాలు, కోడిగ్రుడ్లు విసిరి గోల చేయటం ఆ వూరి వాళ్ళ అలవాటు. అలాంటిది ఆ రోజు ఒక పదిమంది కలిసి క్రుళ్ళిపోయిన టమోటాలు, కోడిగ్రుడ్లు యెన్ని వుంటే అన్నీ కొంటున్నారు.

"మీరంతా ఈ రోజు నాటకాన్ని చూసే వాళ్ళలాగున్నారు. నిజమేనా?" అనడిగాడు వుండబట్టలేక షాపు యజమాని.

"ష్... గట్టిగా అరవకయ్యా! మేము చూచేవాళ్ళం కాదు. నాటకం వేసేవాళ్ళం" అన్నారు వాళ్ళు.

❧❧❧

పేపర్లో ప్రకటన చూసి ఒక పుస్తకాల కంపెనీకి పుస్తకం పంపమని దాని ఖరీదు ఐదు రూపాయలు యం.ఓ చేశాడు చదువుల్రావు. చేసి రెండునెలలయినా ఇంతవరకూ పుస్తకం లేదు. కనీసం డబ్బు చేరినట్లు ఉత్తరం కూడా లేదు.

అందుకని ఆ కంపెనీ అసమర్ధతను గురించీ, అది ప్రజలను మోసం చేసి డబ్బు సంపాదిస్తున్నదనీ, పోలీసు రిపోర్టిస్తాననీ ఎంతో కోపంగా ఓ పొడవాటి ఉత్తరం రాశాడు.

నాలుగు  రోజులకే ఆ కంపెనీ నుంచి ఓ కవరొచ్చింది. అందులో ఇంతవరకూ పుస్తకం పంపనందుకు క్షమించమని, దానికి కారణం మేనేజిమెంటు కాదని, అందులో పనిచేస్తున్న కొంతమంది పనివారల అశ్రద్ధయని వారిని తిడుతూ, ఎంతో సౌమ్యమైన భాషలో రాయబడి వుంది. అది చదివి చదువుల్రావ్  చల్లబడ్డాడు.

పాపం ఆ ఆనందం ఎక్కువసేపు నిలవలేదు. ఆ కవరులో ఆ కంపెనీ మేనేజరు క్లర్కుకు రాసిన చీటీ పొరపాటున అందులోనే వుండిపోయింది. అందులో "ఈ కోతి వెధవకు పోలీసు రిపోర్టు అదీ చేయకుండా ఏదో ఒకటి రాసి పంపండి" అని వుంది.

"నేను నాటకంలో ఒక ముఖ్య పాత్ర ధరిస్తున్నానోయ్"

"హీరోనా?"

"కాదు"

"మరి?"

"పోస్ట్‌మేన్"

"అది అంత ముఖ్య పాత్రా?"

"అవును"

"ఎలా?"

"తెర తీయడంతోనే నేను వచ్చి 'పోస్ట్' అని అరిచి ఒక ఉత్తరం ఇచ్చి వెళతాను. ఆ తరువాత నాటకమంతా ఆ ఉత్తరం మీద ఆధారపడి నడుస్తుంది"

COMMENTS